మహానాడుకు బయలుదేరిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర - నరసన్నపేట : కడప జిల్లా పబ్బాపురం గ్రామ పరిధిలో ఈనెల 27, 28, 29వ తేదీల్లో నిర్వహించే మహానాడు సభకు నరసన్నపేట మండలం నుండి తెలుగుదేశం పార్టీకి చెందిన శ్రేణులు అధిక సంఖ్యలో సోమవారం బయలుదేరారు. ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అధ్యక్షతన నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త, బగ్గు అర్చన నియోజకవర్గం నుండి బయలుదేరిన 3బస్సులు, 30కార్లుకు పచ్చ జెండా ఊపారు. ఛలో కడప నినాదాలతో టిడిపి కార్యకర్తలు వాహనాలపై సందడి చేస్తూ మహానాడు సభకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు కేంద్రాలవుతున్న డ్రైనేజీలు

ప్రజారోగ్యాన్ని పట్టించుకోని పాలకులు, అధికారులు

నరసన్నపేట పౌర వేదిక కన్వీనర్, ఆర్.సురేష్‌బాబు

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలో ప్రజాప్రతినిధుల సహకారంతో అధికారులు నిర్మాణం చేసే మురికి కాలువలు(డ్రైనేజీలు) చెత్త సేకరణకు కేంద్రాలుగా మారుతున్నాయని నరసన్నపేట పౌర వేదిక కన్వీనర్, ఆర్.సురేష్‌బాబు విమర్శించారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ నియోజకవర్గ కేంద్రమైన నరసన్నపేట మెయిన్ రోడ్డుకు ఇరువైపులా మురికి నీరు వెళ్ళేందుకు నిర్మాణం చేసిన డ్రైనేజీల్లో దుకాణదారులు, ప్రయాణీకులు, ప్రజలు వేసిన చెత్తతో పూర్తిగా నిండిపోయాయని, దీని వలన వర్షం నీరు రోడ్డుపై ప్రవహించి, డ్రైనేజీల్లో దోమలు పెంపకం ఎక్కువవుతోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన పంచాయితీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించటంతో మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయి, ప్రజలు అనారోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. పట్టణానికి ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ వస్తున్నప్పుడు కాలువలపై కనిపించే చెత్తను తొలగిస్తున్నారని విమర్శించారు. సాయంత్రం వేళల్లో రోడ్డు ప్రక్కన ఉండే దుకాణ వ్యాపారులు, ప్రభుత్వ ఇన్సూరెన్స్, బ్యాంకుల్లో పనిచేసే అధికారులు కాలువల్లో ఉండే దోమలతో యుద్ధం చేస్తూనే ఉన్నారని దుయ్యబట్టారు. కారుల్లో తిరిగి పాలకులు మాత్రం ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి, కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఇప్పటికైన పాలకులు, అధికారులు శ్రద్ధ వహించి, మురికి కాలువలపై సిమ్మెంటు పలకలు ఏర్పాటు చేసి, మురికినీరు రహదారిపైకి రాకుండా, ప్రజారోగ్యం కాపాడలని సురేష్‌బాబు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట పౌర వేదిక ప్రతినిధులు, గంగాధర్‌రాజు, వైకుంఠరావు, నీలరాజు, సవరయ్య, స్వప్న తదితరులు ఉన్నారు.

ఆప్ షోర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ

విశాలాంధ్ర - మెళియపుట్టి : ఆప్ షోర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి వారికి న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ కోరారు. చీపురుపల్లి గ్రామంలో ఆఫ్ షోర్ నిర్వాసితుల దీక్ష శిబిరాన్ని సోమవారం 5వ రోజు ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా నిర్వాసితులకు రావలసిన ప్యాకేజీ అర్హత తేదీలను పెంచాలని, అర్హత కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ఐదు సెంట్లు ఇండ్ల స్థలం మంజూరు చేయాలన్నారు. ఉపాధి నిమిత్తం వలస పోయిన గ్రామ ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని, నిర్వాసిత కుటుంబాలకు అంత్యోదయ రేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వారికి సిపిఐ అండగా ఉంటుందన్నారు.

మహానాడుకు మండల నాయకులు

విశాలాంధ్ర - ఆమదాలవలస : తెలుగు ప్రజల కోసం తెలుగు రాష్ట్రాల ప్రగతి కోసం దశాబ్దాలుగా కృషి చేస్తున్న తెలుగుదేశం పార్టీ మహా పండుగ కడప గడపలో జరుగు మహానాడుకు ఆమదాలవలస తెలుగుదేశం పార్టీ నాయకులు కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం వెళ్ళనున్నారు. కొత్త రోడ్డు ప్రాంతంలో జెండా ఊపి మహానాడు మహా పండగకు బయలుదేరు తెలుగుదేశం అభిమానులకు వాహన సౌకర్యాలు కల్పించారు. ఈనెల 27 28 29వ తేదీల్లో జరగనున్న మహానాడుకు తరలి వెళ్తున్నారు. సంస్థగతంలో వారికి ఉన్న అర్హతలతో కూడిన ఐడి కార్డులను వేసుకొని వేదిక వద్దకు హాజరుకానున్నారు. అలాగే మహానాడు వేదిక వద్ద మండలాలు నియోజకవర్గాల నుంచి వెళ్లే పార్టీ అభిమానులు అక్కడ రిజిస్ట్రేషన్ చేయవలసి ఉంటుంది. భాస్కరరావు డిల్లేశ్వరరావు రాజు విజయ్ ఆయనతో పాటు ఉన్నారు.

మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించాలి

ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు డిమాండ్

విశాలాంధ్ర - పలాస : చత్తీస్ ఘడ్ నారాయణపూర్ లో ఈ నెల 20న మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 27 మందిని కేంద్ర సైనిక బలగాలు హత్య చేశాయని, వారి మృతదేహాలను రాష్ట్ర ప్రభుత్వాలు బంధువులకు అప్పగించాలని పలు ప్రజా సంఘాలు వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేయాలని హైకోర్టు తీర్పు చెప్పిన ఇంతవరకు ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పజెప్పలేదని ఆందోళన వ్యక్తం చేశారు. చత్తీస్ ఘడ్ రాష్ట్ర ప్రభుత్వం మృతదేహాలను ఆయా కుటుంబ సభ్యులకు అప్పజెప్పిందని రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన మూడు మృతదేహాలను వెంటనే అమరుల మృతదేహాలను వాళ్ళ కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలని, అలాగే కగార్ ఆపరేషన్ నిలుపుదల చేసి శాంతి చర్చలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు వామపక్ష పార్టీలకు చెందిన వంకల మాధవరావు, మద్దిల రామారావు, పోతనపల్లి కుసుమ, పత్తిరి దానేష్ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక ప్రదేశాల్లో యోగాంధ్ర : కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర - 2025 పేరిట రాష్ట్రవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు అనుగుణంగా శ్రీకాకుళం జిల్లాలో నాలుగు ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మే 27 నుంచి జూన్ 10 వరకు ఈ యోగా శిబిరాలు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకూ నిర్వహించనున్నారు. మే 27న డచ్ బిల్డింగ్‌లో, జూన్ 3న అరసవల్లి సూర్యదేవాలయంలో, జూన్ 7న సాలిహుండం బౌద్ధ స్థూపాల వద్ద, జూన్ 10న కలింగపట్నం బీచ్‌లో యోగా శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రానికి వెయ్యిమందిని హాజరయ్యేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. కొన్ని శాఖల జిల్లా అధికారులు సమీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమన్వయంతో విజయవంతం చేయాలి రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్‌ను మొత్తం కార్యక్రమానికి సమన్వయాధికారిగా నియమించారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు శాఖను, తాగునీరు, గ్రీన్ కార్పెట్, శానిటేషన్ వంటి ఏర్పాట్లకు మున్సిపల్, పంచాయతీ, ఆరోగ్యశాఖలను కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. పర్యాటక ప్రదేశాల చరిత్ర, ఫ్లెక్సీలు, బానర్ల ఏర్పాటు, యోగా పోటీల నిర్వహణ వంటి అంశాల్లో ఆయా శాఖల సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. జిల్లాలో అన్ని స్థాయిల్లో అధికారులు సమర్థవంతంగా పనిచేసి యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనవిజయం చేయాలని కలెక్టర్ పుండ్కర్ పిలుపునిచ్చారు.

షెడ్యూల్డ్ కులాల కాలనీ సమస్యలు పరిష్కరించండి

కాంగ్రెస్ నేతల డిమాండ్

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రంలో జలుమూరు షెడ్యూల్డ్ కులాల కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సత్య నారాయణ ఆధ్వర్యంలో తాసిల్దార్ జన్ని రామారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో ప్రత్యేక కమ్యూనిటీ భవనం నిర్మించాలని, వీధిలో కాలువ ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్య తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే మరిన్ని సమస్యలను ఆ వినతి పత్రం ద్వారా తెలియజేశారు. ఆయనతోపాటు జిల్లా మండల స్థాయి కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్‌లోనే బదిలీలు జరగాలి

ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణ మూర్తి, జి.రమణ

విశాలాంధ్ర - శ్రీకాకుళం కలెక్టరేట్ : ఎస్జీటీ ఉపాధ్యాయులకు ప్రిన్సిపల్ సెక్రెటరీ సమక్షంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ హామీ ఇచ్చిన మేరకు బదిలీలు మాన్యువల్ కౌన్సిలింగ్ లోనే నిర్వహించాలని ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణ మూర్తి, జి.రమణ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సమక్షంలో ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ మీద హామీ ఇచ్చారని, నిన్న రిజిస్టర్ ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులకి ఆన్లైన్ కౌన్సిలింగ్ మెరుగైనదని ఆన్లైన్ కౌన్సిలింగ్ కోసం ఆలోచించాలని, ఆన్లైన్ కౌన్సిలింగ్ మీద ఒక వీడియో విడుదల చేసి అభిప్రాయ సేకరణ చేపడతామని అప్పుడే ఒక నిర్ణయానికి వస్తామని తెలియజేయడం ద్వంద వైఖరికి, మోసకారితనానికి నిదర్శనం అన్నారు. ఇప్పటికే బదిలీల అప్లికేషన్ సాఫ్ట్వేర్ లో వచ్చిన ఒక్క లోపాన్ని కూడా నేరుగా సరి చేయకుండా ఎంఈఓ లాగిన్ లో సరి చేసుకోమని కింది స్థాయి అధికారులకు అప్లికేషన్ లో మార్పులు చేసే అధికారం ఇచ్చి ఎన్నడూ లేని గందరగోళానికి తెరదీసి తాంబూలాలు ఇచ్చేశాం తన్నుకు చావండి అనే రీతిగా ఉన్నత విద్యాశాఖ అధికారులు వైఖరి ఉందన్నారు. ఇటువంటి లోపభూయిష్టమైన సాఫ్ట్వేర్లతోనే వెబ్ కౌన్సిలింగ్ నిర్వహిస్తారా అని అధికారులను ప్రశ్నించారు. తక్షణమే సాఫ్ట్వేర్ లో ఉన్న అన్ని రకాల సమస్యల్ని పరిష్కరించి ఉపాధ్యాయులలో నెలకొన్న అయోమయంకు ముగింపు పలకాలన్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీతో జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకి మాన్యువల్ పద్ధతిలోనే బదిలీలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలం అరిణాం అక్కివలస పరిధిలోని శ్యాంపిస్టన్స్ ప్లాంట్-3లో పనిచేస్తున్న కార్మికుడు రెడ్డి సూర్యారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కార్మికుల నుంచి వసూలు చేసిన రూ.1,07,500లను మృతుని భార్య రెడ్డి బాలకు సోమవారం కార్మిక సంఘ నేతలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్వీ రమణ మాట్లాడుతూ తోటి కార్మికుని కుటుంబం కష్టాల్లో ఉంటే మిగిలిన కార్మికులంతా ఆదుకోవడం మంచి సంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.సూర్యనారాయణ, ఎల్.నాగరాజు, కె.నరేష్, పి.సంతోష్, ఎస్.శ్రీను, పి.శ్రీను పాల్గొన్నారు.

మహానాడుకు బయలుదేరిన నాయకులు

విశాలాంధ్ర - రణస్థలం : తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా కడపలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల టీడీపీ రజక సాధికారక కమిటీ నాయకులు వివిధ టిడిపి రజక సంఘాల నాయకులు సోమవారం కడపకు బయలుదేరారు. ఈ కార్యక్రమం రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము, శ్రీకాకుళం జిల్లా టీడీపీ రజక సాధికారక స్టేట్ కమిటీ నాయకులు నౌపాడ రామారావు, అనకాపల్లి జిల్లా టిడిపి రజక సాధికారక స్టేట్ కమిటీ నాయకులు అద్దురి శంకర్, విశాఖపట్నం జిల్లా టీడీపీ రజక సాధికారక కమిటీ నాయకులు చీపురుపల్లి స్వరూప్ తదితరులు వున్నారు.

చరిత్ర పుస్తకాలతో విజ్ఞానం పెంచుకోవాలి

విశాలాంధ్ర - టెక్కలి : పాఠకులు చరిత్ర పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం మరింత పెంచుకోవచ్చని గ్రంథాలయ అధికారిని రూపవతి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక శాఖా గ్రంథాలయం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు, పాఠకులకు నీతి కథల మరియు చరిత్ర పుస్తకాలను చదివే కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల చేత కథలు చెప్పించడం అలవాటుగా మారుతుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయా సహాయకురాలు అమ్మనమ్మ , పాఠకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : అర్జీలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అర్జీలు స్వీకరించారు. 186 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్ రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు శాఖల వారీగా ఒక్కో శాఖలో పెండింగులో ఉన్న అర్జీలపై కలెక్టర్ సమీక్షించారు. పెండింగులో ఉన్న అర్జీలు ఎందుకు పెండింగులో ఉన్నదీ ఆయన అడిగి తెలుసుకున్నారు. సత్వర పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

239 పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు



విశాలాంధ్ర - సంతబొమ్మాళి/కోటబొమ్మాళి : కోటబొమ్మాళి మండలంలోని రామయ్యపేట, పాకివలస గ్రామాల్లో సోమవారం 239 పశువులకు గొంతు వాపువ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేసినట్లు కురుదు పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఈ టీకాలు షెడ్యూల్ ప్రకారం వేయడం జరుగుతుందని చెప్పారు. రైతులందరూ పశు వైద్య సిబ్బందికి సహకరించి తమ పశువులకు టీకాలు వేసుకునే బాధ్యతను తీసుకొని, సరైన కాలంలో సక్రమంగా వేయించుకొని వ్యాధులు రాకుండా నివారించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయనతోపాటు పశు వైద్య సహాయకుడు కే.ముకుందరావు, సిబ్బంది పాల్గొని సేవలందించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు శతశాతం ప్లేస్మెంటు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో 2024-25 విద్యా సంవత్సరంలో రిలీవ్ అయిన 262 మంది విద్యార్థులు శతశాతం మంది వివిధ కంపెనీల్లో ప్లేస్మెంటు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. జానకిరామయ్య తెలిపారు. కళాశాల ఆవరణలో సోమవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళాశాలలో సివిల్, మెకానికల్, కంప్యూటర్స్, ఎలక్ట్రికల్, డీసీసీపీ బ్రాంచ్లో మొత్తం 262 మంది రిలీవ్ కాగా, వీరంతా ఉద్యోగాలు సాధించారని వివరించారు. వీల్స్ ఇండియా, హెచ్ఎంటీ ఇంజనీరింగ్ సర్వీసెస్, మారుతి సుజ్కో, రోయల్ ఎన్ఫీల్డ్, టెక్నిక్స్, టీఏఎస్ఎల్ తదితర కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు కళాశాల ఆవరణలో వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులు పూర్తిచేసిన వారికి ఉజ్వల భవిత ఉందన్నారు. ఈ కళాశాలకు చెందిన మొత్తం విద్యార్థులంతా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని వివిధ బ్రాంచ్ల అధిపత లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐఏఎస్‌కు ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణం

యువ నేత ధర్మాన కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - జలుమూరు : మండలం అల్లాడపేట గ్రామానికి చెందిన బాన్న వెంకటేష్ ఐపీఎస్ లో శిక్షణ పొందుతూ వేరేగా సివిల్స్ రాసి ఐఏఎస్ సెలెక్ట్ కావడం మన జిల్లాకే గర్వకారణం అని మాజీ ఉప ముఖ్యమంత్రి కుమారుడు, నరసన్నపేట నియోజకవర్గ యువ నేత పోలాకి జడ్పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. సోమవారం ఆయన స్వగ్రామంలో వెంకటేష్ ఇంటి వద్ద పూలమాలతో సత్కరించి దుశ్శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఐఏఎస్ లో 15వ ర్యాంకు సాధించడం ఆశామాషా కాదని తల్లిదండ్రుల అదృష్టం వెంకటేష్ కష్టానికి ఫలితం అని ఆయన అన్నారు. మనందరికీ ఎంతో ఆనందాయకమని వెంకటేష్ ని యువత ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో ముందుకు సాగాలని కోరారు. ఆయనతో పాటు జలుమూరు ఎంపీపీ వాన గోపి పోలాకి ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, మాజీ ఏఎంసీ నాయకులు మొజ్జాడ శ్యామలరావు, మండల వైసీపీ అధ్యక్షులు కనుసు సీతారాం, సీనియర్ నాయకులు మూకళ్ల సత్యం, రావాడ చందనం, పర్లాం సర్పంచ్ తవుడు, స్థానిక సర్పంచి ప్రతినిధి కళ్యాణం శ్రీనివాసరావు, వెంకటేష్ తల్లిదండ్రులు పలు ప్రాంతాల నుండి వచ్చిన ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో సేవింగ్స్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం

సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ వి. హరిబాబు



విశాలాంధ్ర - శ్రీకాకుళం : తపాలా శాఖ పోస్టాఫీసుల్లో ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు సేవింగ్స్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసేందుకు ఈ నెల 31 నుండి జూన్ 4వ తేదీ వరకు పోస్టాఫీసుల్లో, గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ వి.హరిబాబు తెలిపారు. ఈ శిబిరాల్లో పోస్టాఫీసు సేవింగ్ ఖాతాలను తెరవడం, ఇప్పటికే ఉన్న ఖాతాలకు ఆధార్ లింక్ చేయడం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసీఎల్) మ్యాపింగ్ జరుగునన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను అర్హులైన లబ్ధిదారులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ (డి బి టి) చేసేందుకు వీలుగా ఈ ఖాతాలు ఉపయోగపడతాయన్నారు. జిల్లాలో ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఖాతాలను పోస్టాఫీసుల ద్వారా పునరుద్ధరణ చేయడం జరుగుతుందని, ఈ ఆధార్ సీడింగ్ జరిగిన ఖాతాలో జమ అయిన పథకాల నగదును ఏ పోస్టాఫీసులో అయినా తీసుకునే సదుపాయం కలదన్నారు. సాధారణ రోజులలో సైతం పోస్టాఫీసులో సేవింగ్స్ ఖాతాలు 10 ఏళ్ళు నిండిన వారు తెరుచుకొవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా ఒక ప్రకటనలో తెలిపారు.

మునగవలస చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు

- ప్రకృతి సంపద దోచేస్తున్న దేశం నాయకులు
- అధికార పార్టీ అంటూ బెదిరింపులు

విశాలాంధ్ర - ఆమదాలవలస : కొండలను సైతం పిండి చేసి తోచేయటం కనిపించే చెరువుల్లో మట్టిని తోడేయటం నదులలో కనిపించే ఇసుకను అక్రమంగా తరలించటం ఆ గ్రామంలోని ఒక నాయకునికి వెన్నతో పెట్టిన విద్యని పలువురు ఆరోపిస్తున్నారు. పార్టీ ఏదైనా అధికారం ఎవరికి ఉన్న ఆ యనే మాటే శాసనం అంటూ అడిగే వారిపై అధికార పార్టీ అంటూ బెదిరిస్తూ ఏ ఎండకు ఆ గొడుగు విడిచి పెట్టి ప్రకృతి సంపదను అక్రమంగా దోచేస్తున్న మహా ఘనుడు ఆ నాయకుడు. కే మునగవలస చెరువులో అక్రమంగా మట్టి తవ్వి వేల రూపాయలకు విక్రయిస్తూ అధికారులను ఏమార్చి పబ్బం గడుపుకుంటున్నారు. జెసిబి లతో ట్రాక్టర్లకు లోడ్ చేసి 600 నుంచి 800 వరకు వెక్కిరిస్తున్నట్లు తెలుస్తోంది. మట్టి విక్రయించేం దుకు వీరికి అనుమతులు ఎలా వచ్చే అన్నది అధికా రులకే తెలియాలి. విచిత్రం ఏమిటంటే 2014లో టిడి పి అనుచరుడు గాను 2019లో వైసిపి ముఖ్య నాయకుడు గాను ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ గనుల వ్యాపారిగాను చలామణి అవుతున్న ఆ వ్యక్తి ఇన్ని దురాగతాలకు పాల్పడిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూసే దాఖలాలు లేవు. ఏబీ రోడ్డు కు అనుకొని ఉన్న మునగవలస చెరువులో జెసిబి లతో మట్టిని ట్రాక్టర్లకు ఎత్తి విక్రయిస్తున్న కనీస చర్య లు చేపట్టేందుకు అధికారులు సాహసించటం లేదు అంటే అక్కడ పరిస్థితి అవగతం అవుతుంది. ప్రభు త్వ నిబంధనలు గాని వాల్టా చట్టం కానీ వీరికి వర్తించవు. ప్రకృతి సంపదను అక్రమంగా దోచుకుని దాచు కునేందుకు వీరికి ఫేక్ ఐడి కార్డులు ఉన్నట్టు కొందరు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అధికారం లో ఎవరు ఉన్న అక్రమాల్లో ఆయనే అగ్రస్థానం. రోడ్డు పక్కనే ఉన్న చెరువులో మట్టిని తోడేస్తున్న రెవిన్యూ అధికా రులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శ లు జోరుగా వినిపి స్తున్నాయి. అక్రమ తవ్వకాలకు ఎప్పటికప్పుడు స్థానిక సచివాలయ అధికారి చెల్లింపులు చేస్తారని ప్రచారం ఉంది. అక్రమాలలో అందరికీ వాటా ఉన్నప్పుడు ప్రకృతి సంపద ఎలా పోయిన మాకు ఏమిటి అన్న పరిస్థితులలో కొంతమంది ఉన్న ట్లు తెలుస్తుంది.

అధికార పార్టీ అంటూ బెదిరింపులు... ఒకవైపు ఇసుక మరోవైపు గనులు(కొండలు) ఇంకో వైపు మట్టి ఏదేచ్ఛగా తరలిస్తున్న కనీస చర్యలు చేప ట్టే అధికారులు కరువయ్యారు. కొంతమంది నాయకుల మౌఖిక ఆదేశాలతో వారి వైపు కొన్ని చూసేందుకు ఇష్టపడటం లేదు. ఏమిటి అక్రమమని ప్రశ్నించిన వారికి అధికార పార్టీ అంటూ బెదిరింపులు వస్తున్నట్లు తెలియ వచ్చింది. ఆ గ్రామంలో అన్నీ తానే నడిపిస్తూ నియోజకవర్గ నాయకులకు తలలో నాలుకగా వ్యవ హరిస్తారని ఆయన సన్నిహితులు చర్చించు కుంటు న్నారు. ఏది ఏమైనా ఈయన వ్యవహార తీరు అధి కార పార్టీ వైపేనని అందుకే ఆయన ఇన్ని అక్రమాలు చేసిన ఎవరు పట్టించుకోరని వాదన వినిపిస్తుంది.

తహసీల్దార్ ఏమన్నారు అంటే...!

ఆమదాలవలస తాసిల్దార్ రాంబాబు వద్ద అక్రమ మట్టి తవ్వకాలు పై ప్రశ్నించగా తనకు ఏమీ తెలియదని, మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని పరిశీలించి చర్యలు చేపడతానని తెలిపారు.

వ్యవసాయ డిప్లమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రిన్సిపాల్ సీపాన నీలవేణి



విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆచార్య ఎంజీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో వ్యవసాయ డిప్లమా కోర్సులలో ప్రవేశాలకు విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసిందని అర్హులైన ఆసక్తికర విద్యార్థులు వ్యవసాయ డిప్లొమా కోర్సులు చదివేందుకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తొగరాం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీపాన నీలవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేవారు ఈనెల 28వ తేదీ నుంచి జూన్ 16 లోపు అప్లై చేయాలన్నారు. ఈ కోర్సులో చేరేందుకు విద్యార్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల తొగరాం పని వేళల్లో వివరాలకు సంప్రదించాలన్నారు. దూర ప్రాంతంలో ఉన్నవారు 7702394824 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే ఎంజీఆర్ ఆధ్వర్యంలో మహానాడుకు తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం : ఈ నెల 27,28,29 వ తేదీలలో కడప లో జరిగే తెలుగుదేశం పార్టీ పెద్ద పండుగ మహానాడుకు పాతపట్నం నియోజకవర్గం శాసన సభ్యులు మామిడి గోవింద రావు ఆధ్వర్యంలో సోమవారం భారీగాతెలుగు తమ్ముళ్లు పాతపట్నం నియోజకవర్గం పరిధి 5 మండలాల నుండి నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే ఎంజీఆర్ ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా కడప కిబయలు దేరి పయనం అయ్యారు. 5 మండలాల పరిధిలో నాయకులు, కార్యకర్తలు,సీఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వం, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నాయకత్వం వర్ధిల్లాలని నిన దిస్తూ ముందుకు సాగారు. మహానాడు విజయవంతం అయ్యేలా పాతపట్నం నియోజకవర్గ శ్రేణులను సమాయత్తపరిచిన ఎంజీఆర్‌కు కార్యకర్తలు కృతజ్ఞతలు అందజేశారు. ఈ పర్యటనలో ఐదు మండలాల తెదేపా నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఏపీ ఈఏపీ సెట్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్-2025 మంగళవారంతో మ గియనుంది. జిల్లాలోని శ్రీ శివానీ, శ్రీ వెంకటేశ్వర, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలు, కోర్ టెక్నాలజీ కేంద్రాలల్లో ఈ నెల 19వ తేదీ నుంచి ఈ పరీక్షలు జరుగుతున్నాయి. సోమవారం శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం) లో రెండు షిఫ్ట్ ల్లో కలిపి 559కు 539 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 343కు 330 మంది హాజరయ్యారు.

సచివాలయాలలో సిబ్బంది కొరత

- అందుకే ప్రజలకు సేవలు అందడంలో లోపం.
- ఉన్న వారిపై పని భారం.
- వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేయాలి.

విశాలాంధ్ర-టెక్కలి: సచివాలయాలలో రేషన్ కార్డుదారులు ఈ - కేవైసీ కష్టాలు అనే విశాలాంధ్ర పత్రికలో వచ్చిన శీర్షిక తో సచివాలయంలో ఉన్న అసలు నిజాలు బయటపడ్డాయి. మండలంలోని ఒకటి నుండి ఐదు సచివాలయాలు ఉండగా అందులో కొన్ని సచివాలయాలలో సిబ్బంది కొరత ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడం వాటిని ప్రజలకి అందించడమే బాధ్యతగా భావించిన సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం అదనపు బాధ్యతలు మోపుతున్నారంట. ప్రధానంగా సచివాలయాల పరిధిలో అన్ని సేవలు ఉండేలా ఉద్యోగులను నియమించిన వారిలో కొందరు ఉన్నత ఉద్యోగాలు కారణంగా బదిలీలు అవుతున్నారు. దీంతో ప్రతి సచివాలయంలో ఖాళీగా ఉన్న శాఖలకు సంబంధించి మిగిలిన సిబ్బందిపై అధిక పనిభారం ఒత్తిడి ఏర్పడుతున్నట్లు కనిపిస్తోంది. ఏ శాఖకు సంబంధించి ఆ శాఖకు పనులు ఉంటాయని, పనులు తొందరగా అవ్వాలంటే కష్టమని వారి మాటల్లో తెలుస్తోంది. ఇక సచివాలయాలలో ప్రజలు పనులు పై కాపుల కాయాల్సిం దేనా... లేక ఉన్నత అధికారులు స్పందించి సిబ్బంది కొరత లేకుండా పనులు వేగవంతం చేస్తారో లేదో అని వేచి చూడాల్సిందే. వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పనులు సులువుగా వేగవంతం అయ్యేలా చూడాలని ఉన్నతాధికారులకు స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రధాన రహదారి నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: మండలం బెండి గేటు నుండి వజ్రపుకొత్తూరు మండల కేంద్రం వరకు ప్రధాన రహదారి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించకపోతే రోడ్డు దిగ్బంధనం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు కే మోహనరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం మండలం బెండి గ్రామంలో ప్రజా సంఘాలు మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో పోరుయాత్ర చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం సి ఆర్ ఐ ఎఫ్ (సెంట్రల్ రోడ్డు ఇన్ఫ్రా స్ట్రక్చర్ ఫండ్) నిధుల నుండి మూడు సంవత్సరాలక్రితం రూ.30 కోట్లు కేటాయించడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం, ఉన్న రోడ్డును తవ్వేయడం వలన గత మూడు సంవత్సరాల కాలంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అయినా ఎందుకు తీసుకురావడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఎందుకు నిధులు విడుదల చేయడం లేదని వారు ప్రశ్నించారు. బెండి రోడ్డు తవ్వడం వలన నీరు నిల్వ అయి రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని వారన్నారు, అదే విధంగా గ్రామస్తులు దుమ్ము, ధూళి, బురదతో వ్యాధులు బారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెండి రోడ్డు విషయం ప్రభుత్వానికి పట్టదా..? అని వారు ప్రశ్నించారు, పోరు యాత్ర కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్ .గణపతి రైతు సంఘం నాయకులు కోనారి. హేమసూధన రావు, కె .బాలాజీ , తమ్మి నాన .భాస్కరరావు కార్మిక సంఘం నాయకులు కే. వెంకటరావు , బి. ధర్మారావు, బి శంకర్ ,డి వై ఎఫ్ ఐ సంఘం నాయకులు కె మహేష్, ఎం. రమేష్, డి హరికృష్ణ, శేఖర్, హనుమంతు బాలకృష్ణ, హెచ్ చిన్నారావు, తారకేశ్వర రావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవత ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర-మందస: మందస ప్రజల ఇలవేల్పు, గ్రామదేవత అన్నపూర్ణమ్మ ఆలయం 15వ వార్షికోత్సవ కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామదేవతకు ఆలయ అర్చకులు గోవిందు దుదిష్టి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం ప్రాంగణంలో భవాని సన్నిధానం ఆధ్వర్యంలో హెూమం కార్యక్రమం చేపట్టారు. స్థానిక దేవర వీధి నుంచి మార్కెట్ రోడ్ మెయిన్ రోడ్ శాసనం వీధి మీదుగా ఊరేగింపుతో భక్తులు ముర్రాటలు పట్టుకుని గ్రామ దేవత ఆలయాన్ని చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గ్రామదేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ దేవతకు ముర్రాటలతో చల్లదనం చేశారు ఈ కార్యక్రమం ఆలయం అభివృద్ధి కమిటీ భవాని సన్నిధానం ఆధ్వర్యంలో జరిగింది.

ఉలిక్కిపడ్డ ఉద్దానం

- తలతంపర సంబరాల్లో విషాదం
- విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి
- మరొకరి పరిస్థితి విషమం

విశాలాంధ్ర-సోంపేట: శ్రీకా కుళం జిల్లా కంచిలి ఉద్దానం ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కంచిలి మండలం తలతంపర గ్రామంలో జరుగుతున్న అమ్మవారి సంబరాల్లో అపశృతి చోటు చేసుకుంది. అలంకరణ కోసం వేలాడదీసిన విద్యుత్ వైర్లు నేలపై పడి ఉండడాన్ని గమనించని చిన్నారులు విద్యుత్‌షాక్‌కు గురవ్వగా వారిని కాపాడేందుకు ప్రయత్నించిన మరో వ్యక్తి కూడా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే కుప్పకూలిపోవడంతో తలతంపర గ్రామపంచాయతీ మొత్తం విషాదంతో నిండిపోయింది. ఈ ఘటనలో మరో వ్యక్తి బరంపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళితే తలతంపర పంచాయతీలో జరుగుతున్న అమ్మవారి సంబరాల్లో సుమారు 30 కుటుంబాలతో కూడిన చిల్లపుట్టుగ అనే గ్రామంలో ఈ విషాదం చోటు చేసుకుంది. సోమవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో జరిగిన ఘటనను గ్రామస్తులు బయటకు తెలియకుండా కప్పిపుచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ సుమారు 2 గంటల సమయంలో సమాచారం బయటకు పొక్కడంతో ఈ ఘటనను చూసేందుకు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు చేరుకున్నారు.

చివరి రోజున పెద్దప్రమాదం

అమ్మవారి సంబరాలు మంగళవారంతో ముగియనుండగా ఒక్కరోజు ముందు ఎవరూ ఊహించని విధంగా ఘోర ప్రమాదం చోటు చేసుకోవడం గమనార్హం. ఎంతో సరదాగా ఉత్సాహ వాతావరణంలో సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి ఊరేగింపులతో సరదాగా గడిపేందుకు గ్రామస్తులు, బంధువులు పెద్దసంఖ్యలోనే చిర్లపుట్టుగ చేరుకున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జరిగిన ఘోరం సమీప గ్రామాలందరినీ విషాదంలోకి నెట్టింది. ఈ ప్రమాదంలో ఈశ్వరరావు మృతి చెందడంతో ఆ కుటుంబం ఓ పెద్ద దిక్కును కోల్పోయింది. జీవనోపాధి కోసం ఈశ్వరరావు శ్రీకాకుళంలోని ఒక హెూటల్‌లో వంట మనిషిగా పని చేస్తున్నారు. మరోవైపు డిగ్రీ చదువుకున్న ఇతడు పోటీ పరీక్షల కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇటువంటి పరిస్థితుల్లో ఇంకా వివాహం కాని ఈశ్వరరావు మరణించడంతో ఆ కుటుంబం రోధిస్తున్న తీరు అందరినీ కంట తడి పెట్టించింది. మృతుల్లో ఇద్దరు చిన్నారులు సంబరాల కోసం ఇతర గ్రామాల నుంచి బంధువుల ఇళ్లకు వచ్చి ఇలా మృతి చెందడం అటు వారి స్వగ్రామాల్లోను చిర్లపుట్టుగలోను తీవ్ర విషాదాన్ని నింపింది.

చర్లపుట్టుగ గ్రామానికి ఆదివారం రాత్రి అమ్మవారు ఊరేగింపుగా రావడంతో గ్రామస్తులు బరంపురం నుంచి వచ్చిన విద్యుత్ అలంకరణ సామాగ్రితో విద్యుత్ అలంకరణతో గ్రామాలని అలంకరించారు. సోమవారం ఉదయానికి వేలాడదీసిన విద్యుత్ వైర్లు దురదృష్టవశాత్తు నేలపై పడడం వాటిలో విద్యుత్ ప్రవాహం జరుగుతుండడంతో ఆటలాడుకునేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చిన 12 సంవత్సరాల అమ్మాయి నందినికి తాకడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. అలాగే కృష్ణ అనే చిన్నబాలుడు కూడా ఆటలాడుకున్న సందర్భంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు మెడకు, భుజానికి తాకడంతో ఇతడు కూడా విద్యుత్ షాక్ విలవిలలాడాడు. ఇది గమనిస్తున్న మేనమామ ఈశ్వరరావు వీరిద్దరినీ రక్షించేందుకు వెళ్లిన మేనమామ ఈశ్వరరావు కూడా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే నేలకొరిగాడు. అలాగే రెండేళ్ల వయస్సు గల మనోజ్ అనే బాలుడు కూడా విద్యుత్‌షాక్‌కు గురై విషమ పరిస్థితుల్లో సోంపేట ప్రభుత్వ ఆసుపత్రినుంచి బరంపురం ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. ఇదిలా ఉండగా ఈ ఘటన స్థలానికి చేరుకునే తరుణ్ అనే వ్యక్తి విద్యుత్ వైర్లును తాకడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇతను జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లి సంబరాల సందర్భంగా నాలుగు రోజులు క్రితమే స్వగ్రామానికి చేరుకున్నాడు. ఇతని పరిస్థితి కూడా కొంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రమాదాన్ని దాచిపెట్టిన గ్రామస్తులు

ఇంత ఘోరమైన ప్రమాదం చోటు చేసకున్నప్పటికీ బయటకు తెలియకుండా సుమారు 3 నుంచి 4 గంటల సమయం గ్రామస్తులు దాచిపెట్టడం గమనార్హం. బయటకు తెలియనీయకుండా గ్రామంలోనే అన్ని పనులు పూర్తి చేయాలని భావించినప్పటికీ మృతి చెందిన చిన్నారులు ఇతర గ్రామాలకు చెందినవారు కావడంతో వారి ద్వారా సమాచారం లీకై వివిధ వర్గాలు మధ్యాహ్నానికి గ్రామానికి చేరుకున్నాయి. సోంపేట సీఐ మంగరాజు, కంచిలి ఎస్సై పారినాయుడు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరిస్తుండగా తహశీల్దార్ రమేష్, విద్యుత్‌శాఖ సిబ్బంది మధ్యాహ్నానికి గ్రామానికి చేరుకున్నారు. విద్యుత్ తీగలు నేలపై పడడంతో ఈ నిర్లక్ష్యానికి ఎవరు కారకులు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. అప్పటికే సాయంత్రం కావడంతో మృతదేహాలకు మంగళవారం పోస్టుమార్టం జరిగే అవకాశం ఉంది.

ఘనంగా వట సావిత్రి పూజలు

విశాలాంధ్ర -కవిటి: అంబ అమావాస్య సందర్భంగా సోమవారం మండలంలోని బొరివంకలోని శ్రీరామలింగేశ్వర, జగతిలోని జగదీశ్వర ఆలయాల్లో వట సావిత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఈ ఏడాది పండిన పనస, మామిడి, ఇతర ఫలాలతో స్వామివారికి నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు ఆలయాలకు రావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

'నంబాల' మృతదేహాన్ని వారి కుటుంబాలకు అప్పగించాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: చత్తీస్‌ఘడ్‌లో గత వారం జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లో మరణించిన మావోయిస్టు కేంద్ర కార్యదర్శి, నంబాల కేశవరావు మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు, నేతింటి నీలంరాజు, పిడిఎం నాయకులు, పెదలావు దాలినాయుడు, జామాన వెంకటరావు, ఏఐకేఎంఎస్ నాయకులు, భైరి కూర్మారావు డిమాండ్ చేశారు. సోమవారం వారు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ మావోయిస్టులను నిర్ధాక్షణ్యంగా కాల్చి, చంపిన కేంద్ర ప్రభుత్వం వారి మృతదేహాలను వారి స్వస్థలానికి రాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ యంత్రాంగాలు అడ్డుపడటం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వ దుశ్చర్యలను ప్రజలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని కోరారు. ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామిక దేశమని చెప్పుకుంటున్న భారత్ ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసుల్ని, మావోయిస్టులను హత్య చేయటం దారుణమని, మావోయిస్టులతో శాంతి చర్యలు జరపాలని కోరారు.

పైసా వసూళ్లలో జిల్లా ఆసుపత్రి ప్రధమ స్థానం...!

విశాలాంధ్ర -టెక్కలి: పాజిటివ్ పబ్లిక్ ప్రేసెప్షన్ సర్వే ఐవిఆర్ఎస్ 4వ నెల రిపోర్ట్ విడుదల ప్రకారం రోగుల నుండి డబ్బులు వసూళ్ళు చేయడంలో టెక్కలి జిల్లా ఆస్పత్రి ప్రథమ స్థానంలో ఉందని స్పష్టం చేసింది. ఈ రిపోర్టు ప్రకారం ఇటీవలే ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, క్యాజువాలిటీ విభాగంలో కుట్లు వేస్తున్న ప్రాంతంలో రోగుల నుండి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు తాజాగా నిజమయ్యాయి. ప్రభుత్వం పేద ప్రజల కోసం కొన్ని కోట్ల రూపాయలతో ఆసుపత్రిని అభివృద్ధి చేస్తూ, పనిచేస్తున్న వారికి వేళల్లో జీతాలు ఉన్నప్పటికీ అక్కడ సిబ్బంది మాత్రం కక్కుర్తి పడుతూ పేద రోగుల నుండి డబ్బులు వసూలు చేస్తూ ప్రభుత్వ ఆస్పత్రిను ప్రైవేట్ ఆస్పత్రి కంటే హీనంగా మారుస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి మరలా ఇలాంటి వసూలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక రోగులు కోరుకుంటున్నారు.

గ్రామంలో పాములు సయ్యాట ...

విశాలాంధ్ర-టెక్కలి: పాములు చూస్తే భయపడతాం... అదే పాములు నాట్యం చేస్తే... భలే ఉంటుంది కదా... అలాంటి సంఘటన మండలంలోని పెద్దసాన గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోకి ప్రవేశించిన రెండు పాములు ఒకదానికొకటి పెనవేసుకొని ఇల్లు వద్ద దర్శనమిచ్చాయి. దీంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కొందరు యువకులు ఆ దృశ్యాలను మీడియా తీసి సామాజిక మధ్యమూలో పంచుకున్నారు. ఆటో గ్రామంలో ఒక్కసారిగా ఆ నాట్యాన్ని చూసి చిన్నారులు, గ్రామస్తులు ఆనందించారు. పాములు సంచారం పై గ్రామస్తులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం ప్రజలు ఆనందం

విశాలాంధ్ర -జలుమూరు: సోమవారం మధ్యాహ్నం జలుమూరు సారవకోట మండల పరిధిలో అనే గ్రామాల్లో అకాల వర్షం కురవడంతో ప్రజలు ఆనందవ్యక్త పరుస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో సతమతమవుతూ ఇబ్బందులు పడిన ప్రజలకు ఒక్కసారిగా వాతావరణం లో మార్పు రావడం ప్రజలు ఆనందం వ్యక్తపరిచారు. కాస్త చల్లదనంతో ప్రజలు సంతోష వ్యక్తపరిచారు. రోహిణి కర్తులకు భయాందోళన చెందుతున్న ప్రజలు ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడంతో ప్రజలు ఆనందపడ్డారు. మరోవైపు రైతులు ఈ వర్షంతో కాస్త వ్యవసాయ పనులు ప్రారంభం అవుతాయని గట్టిపడ్డ భూములను సాగు చేసుకోవచ్చని దుక్కులు ప్రారంభమవుతాయని పలు రైతులు ఆనందం వ్యక్త పరిచారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

విశాలాంధ్ర-మందస: ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని మందస తహసిల్దార్ మిస్కా శ్రీకాంత్ అన్నారు. సోమవారం కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వివిధ రకాల ఫిర్యాదులను, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలనుంచి వచ్చిన వినతులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన నరసన్నపేట సి.ఐ, శ్రీనివాసరావు

విశాలాంధ్ర -నరసన్నపేట: ఇటీవల జరిగిన బదిలీల్లో నరసన్నపేట నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.శ్రీనివాసరావు సోమవారం శ్రీకాకుళం జిల్లా ఎస్పీ, కె. వి. మహేశ్వర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో కలిసిన శ్రీనివాసరావు ఎస్పీ, మహేశ్వరరెడ్డికి పూలమొక్కను అందచేశారు. ఈ సంధర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నరసన్నపేట సర్కిల్ పరిధిలో ప్రజానీకానికి అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి, శాంతి, భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

ప్రజా సమస్యలను ఓర్పుతో వినాలి

బదిలీపై వెళ్ళిన సి.ఐ, జె.శ్రీనివాసరావు

విశాలాంధ్ర -నరసన్నపేట: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలను సంబంధిత పోలీస్ సిబ్బంది ఓర్పుతో వినాలని సి.ఐ, జె.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక మేఘన హెూటల్‌లో సి.ఐ, శ్రీనివాసరావుకు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. నరసన్నపేట సబ్-ఇన్‌స్పెక్టర్, సిహెచ్.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన సి.ఐగా వచ్చిన ఎం.శ్రీనివాసరావు, బదిలీపై విశాఖపట్నంకు వెళ్ళే ప్రస్తుత సి.ఐ, జె.శ్రీనివాసరావుకు ఘనంగా శాలువ కప్పి, పుష్పగుచ్ఛమందించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పోలాకి, జలుమూరు, సారవకోట ఎస్.ఐలు, రంజిత్, అశోక్‌బాబు, అనిల్‌కుమార్, టిడిపి నాయకులు, భైరి భాస్కరరావు, ధర్మాన తేజ్‌కుమార్, శిమ్మ చంద్రశేఖర్, నాలుగు పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘంలో గల మూఢనమ్మకాలనే రుగ్మతలను పారద్రోలాలి

సాహితీవేత్త పొట్నూరు. కోటి బాబు

విశాలాంధ్ర-కొత్తూరు: స్థానిక విజ్ఞాన భారతి పాఠశాల ఆవరణలో నిర్వహించిన కొత్తూరు రచయితల వేదిక రెండోనెల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కోటిబాబు మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్ర్య సమరంలో ప్రజలను చైతన్యపరిచే విధంగా, దేశభక్తిని పెంపొందించే విధంగా సాహితీవేత్తల గీతాలు ఎంతగానో దోహదపడినట్లు ఆయన గుర్తుచేశారు. అనేక దురాచారాలను రూపుమాపేందుకు, ప్రజలను కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దేలా చైతన్యపరిచేందుకు ఈ సాహిత్యం ఎంతగానో తోడ్పడునని కోటిబాబు అన్నారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కుదమ తిరుమలరావు సమన్వయంతో, నిర్వహించిన కవిసమ్మేళనంలో కుదమ తిరుమలరావు వందనం, కలమట శ్రీరాములు భాషా ఔన్నత్యం, డా.యెన్ను అప్పలనాయుడు మాతృభాష నినాదం, ముదిల శంకరరావు జాతీయ పతాకం, పెదకోట ధనుంజయరావు శ్రమజీవి, గడసాపు ఉషారాణి వీరజవాను, ఎవిఆర్ఎం రాజా దిలీప్ పట్నాయక్ భాషకు వెలుగు 'కొరవే', గేదెల మన్మధరావు ఆపరేషన్ సిందూర్, బూరాడ గణేష్ అభిమతం అను కవితలను వినిపించి అందరి ప్రశంసలు పొందారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథి పొట్నూరు కోటిబాబును, కవి సమ్మేళనంలో పాల్గొన్న కవి కవయిత్రులను శాలువాలతో గ్రంథాలతో వేదిక ఘనంగా సన్మానించింది. బహుమతులను అందజేశారు. కుదమ తిరుమలరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో దుక్క గణపతిరావు, సి. హెచ్.మార్కో, బౌరి మురళి, బి.పద్మ, జన్ని నాగరాజు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వివరాలు ఆన్‌లైన్ చేసుకోవాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: స్వర్ణ పంచాయితీ ఇంటి పన్నుల వివరాలను ప్రతీ గృహ యజమానులు ఆన్‌లైన్ చేసుకోవాలని మేజర్ పంచాయితీ ఈ.ఓ, పి.ద్రాక్షాయిణి అన్నారు. సోమవారం ఆమె విశాలాంధ్రతో మాట్లాడుతూ ఇంటి పన్నుల ఆన్‌లైన్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు అనుసరించి, గృహ యజమానులు వారి ఆధార్ నంబర్, సెల్ ఫోన్ నెంబర్, ఇంటిపన్నుకు అనుసంధానం చేయుటకు సహకరించాలన్నారు. మాకున్న తక్కువ సమయంలో పట్టణంలో అన్ని గృహాల వద్దకు రావాల్సి ఉండగా, మా పంచాయితీ సిబ్బంది వచ్చేసరికి, మీరు ఇంటివద్ద లేనిచో ఆలస్యం అవుతుందన్నారు. కాబట్టి మా పంచాయితీకి చెందిన కంప్యూటర్ ఆపరేటర్, ముద్దాడ వెంకటరమణ, సెల్ నెంబర్-9032891811కు వాట్సాప్‌కు మీ ఇంటి పన్ను అసెస్మెంట్ నంబర్, పేరు, చిరునామా, ఆధార్ కార్డ్ నెంబర్, ఫోన్ నెంబర్ పంపించాలన్నారు. ఈ వివరాలతో త్వరితగతిన మా పంచాయితీ సిబ్బంది మీ ఇంటిపన్నును అన్‌లైన్ చేస్తామన్నారు. అలా కాని పక్షంలో ఆన్‌లైన్ చేసుకోవాల్సిన గృహ యజమానులు పంచాయితీ కార్యాలయానికి పైన పేర్కొన్న ఆధారాలలో వచ్చి, కంప్యూటర్ ఆపరేటర్, వెంకటరమణకు సంప్రదించాలని కోరారు.

తిలారులో నేడు మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర సంతబొమ్మాళి/కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం పరిధి తిలారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ తెలిపారు. తర్ర శిమ్మినాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులచే, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కంటి సమస్యలున్న పరిసర ప్రాంత గ్రామస్తులు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని అవసరమైన వాళ్లకు ఉచిత కంటి ఆపరేషన్ కు తరలించడం జరుగుతుందని చెప్పారు.

పశువుల దాణా పంపిణీ



విశాలాంధ్ర -సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పశు వైద్య కేంద్రం మొత్తం సోమవారం పశువుల దానాలు పంపిణీ చేసారు. వెటర్నరీ సహాయ సంచారకులు విజయ్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీతో కూడిన ఈ పథకాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కుచెట్టి కాంతారావు, మెండ అప్పారావు, మండల వెటర్నరీ డాక్టర్గౌతమ్, సిబ్బంది సత్యనారాయణ, తిరుపతిరావు, వెంకటరమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర -వజ్రపుకొత్తూరు: మండలంలో దోకులపాడు గ్రామానికి చెందిన వడ్డి భారతి, గరుడభద్ర గ్రామానికి చెందిన వాసులు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని గుజరాత్ రాష్ట్ర జనసేనల అధ్యక్షులు మూగి వేణు, వజ్రపుకొత్తూరు అధ్యక్షులు వడ్డి బాలక్రిష్ణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపడతామన్నారు. కార్యక్రమంలో పుక్కళ్ల ఉమామహేశ్వరరావు, వడ్డి రిషి, లండ గిరిబాబు, ఉష, శేషగిరి, ప్రశాంత్, సాగర్‌లు పాల్గొన్నారు.

వైభవంగా జలయాత్ర

విశాలాంధ్ర- ఇచ్ఛాపురం: స్థానిక సత్యసాయి మందిరం సమీపంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యాంజనేయ స్వామి ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. అందులో భాగంగా స్వామి వారి విగ్రహానికి పవిత్ర నదీ జలాలతో అభిషేకించేందుకు బాహుదా నది నుండి కళశాలతో నీటిని తరలించే జలయాత్రను వైభవంగా నిర్వహించారు. వేద పండితుల పర్యవేక్షణలో నదీ తీరంలో తొమ్మిది మంది జంటలతో ప్రత్యేక పూజలను వందలాది మంది మహిళలు పాల్గొనగా జరిపించారు.